క్లుప్తంగా

షటిల్ టోర్నమెంట్ ప్రారంభం



క్రీడా బృందంతో ఎస్పీ సతీష్‌కుమార్, ద్వారంపూడి వీరభద్రారెడ్డి తదితరులు

కాకినాడ క్రైం: కాకినాడ ఆఫీసర్స్ క్లబ్‌లో ఏర్పాటైన కిరణ్ మెమోరియల్ షటిల్ టోర్నమెంట్‌ను జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ ఆంధ్రప్రదేశ్ రైస్‌మిల్లర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ద్వారంపూడి వీరభద్రారెడ్డితో కలసి శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ క్రీడలు మనోవికాసం, దేహ దారుఢ్యం, క్రమశిక్షణకు దోహదపడతాయన్నారు. కార్యక్రమంలో పోలీస్ అధికారులు, క్రీడా నిర్వహణ బృందం పాల్గొన్నారు.

చలివేంద్రం ఏర్పాటు



నడకుదురులో చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న సర్పంచ్ లలితకుమారి

కరప: నడకుదురు గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద శనివారం ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని సర్పంచ్ డేగల లలితకుమారి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వేసవిలో పంచాయతీ కార్యాలయానికి వచ్చే ప్రజలు, ప్రధాన రహదారిలో వెళ్లే వాహనచోదకుల దాహార్తి తీర్చేందుకు చలివేంద్రాన్ని ఏర్పాటు చేశామన్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు పంచాయతీ వద్ద చలివేంద్రాన్ని నిర్వహిస్తున్నామని కార్యదర్శి పీఎస్‌వీర్ బ్రహ్మానందం తెలిపారు.

ఇంటింటా అభిమానం



వేములవాడలో ప్రభుత్వ పాలనపై సర్వే చేస్తున్న సర్పంచ్ మంగాదేవి

కరప: వైఎస్సార్ సీపీ చేపట్టిన జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమం ఉత్సాహభరిత వాతావరణంలో జరుగుతోంది. ప్రతి ఇంటా ప్రజలు అభిమానం చూపుతున్నారు. ప్రభుత్వ పథకాల అమలుపై సంతోషం వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని పలు గ్రామాల్లో శనివారం సచివాలయాల కన్వీనర్ కాదా వెంకటేశ్వరరావు గృహ సారథులు, సచివాలయ కన్వీనర్లు, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, వలంటీర్లు, పార్టీ శ్రేణులతో కలసి జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమం నిర్వహించారు. వేములవాడ, విజయరాయుడుపాలెం, పెద్దాపురప్పాడు, సిరిపురం, కొరిపల్లి తదితర గ్రామాల్లో ఇంటింటికీ వెళ్లి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చాక అమలు చేస్తున్న పథకాలు, పాలనపై ప్రజా సర్వే చేశారు. ప్రజల అంగీకారంతో ఇంటి తలుపులు, గేట్లపై జగనన్నే మా నమ్మకం స్టిక్కర్లు అతికించారు.

రైతుల పక్షపాతి ప్రధాని మోదీ

బోట్‌క్లబ్: రైతుల సంక్షేమమే ధ్యేయంగా ప్రధాని మోదీ అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెడుతున్నారని బీజేపీ కిసాన్ మోర్చా జాతీయ కార్యవర్గ సభ్యుడు యార్లగడ్డ రామ్‌కుమార్ అన్నారు. శనివారం కాకినాడలో విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. గతంలో ఏ ప్రభుత్వం ఇవ్వని విధంగా ఏటా పీఎం కిసాన్ సమ్మాన్ నిధి పథకం ద్వారా రూ. 6 వేలు నేరుగా రైతుల ఖాతాల్లో జమ చేస్తున్నారన్నారు. ఖరీఫ్ పనులకు సిద్ధమవుతున్న రైతులకు ఈ పెట్టుబడి సహాయం కొండంత అండగా ఉంటుందన్నారు. కేంద్ర ప్రభుత్వ ఆ. దీనంతో ఈ మార్కెటింగ్ విధానం అందుబాటులోకి తెచ్చారన్నారు.

మల్ల యుద్ధభేరి రేపు

కాకినాడ సిటీ: భారత రాజ్యాంగ రక్షణ, ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ, క్రైస్తవ, మైనారిటీ, మహిళల హక్కుల పరిరక్షణకు ఈ నెల 24న మెక్లారిన్ హైస్కూల్ గ్రౌండ్‌లో మాలల మల్ల యుద్ధభేరి మహాసభ నిర్వహించనున్నట్లు మాల మహానాడు వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షుడు సిద్ధాంతుల కొండబాబు తెలిపారు. శనివారం స్థానిక శాంతి భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆంధ్రమాల మహానాడు 7వ వార్షికోత్సవం సందర్భంగా చలో కాకినాడ నిర్వహిస్తామన్నారు. అనంతరం కార్యక్రమానికి సంబంధించిన గోడపత్రికలు, కరపత్రాలను విడుదల చేశారు. నాయకులు రత్నంబాబు, లింగం శివప్రసాద్, చెంగళరావు, గుబ్బల ఆదినారాయణ, లింగం నాని, అంబటి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

5న అంబేడ్కర్ జయంతి ముగింపు ఉత్సవాలు

బోట్‌క్లబ్: బీఆర్ అంబేడ్కర్ జయంతి ఉత్సవాల ముగింపు కార్యక్రమాన్ని వచ్చే నెల 5న కాకినాడలో నిర్వహిస్తున్నట్లు బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు చిట్నీడి శ్రీనివాస్ తెలిపారు. అంబేడ్కర్ జయంతి ఉత్సవాలను శనివారం జగన్నాథపురంలో ఈస్ట్ మండల అధ్యక్షుడు సంగాని సత్యం ఆధ్వర్యంలో నిర్వహించారు. అంబేడ్కర్ ఆశయ సాధనకు ప్రధాని మోదీ కృషి చేస్తున్నారన్నారు. నగర కన్వీనర్ గట్టి సత్యనారాయణ, నాయకులు కొక్కిలిగడ్డ గంగరాజు, పైడిమల్ల చెరియన్, ఏడిద కృష్ణ పాల్గొన్నారు.

ప్రాణాలతో జలగాటం

- జలకాలాటలలో జాగ్రత్తలు అవసరం
- ప్రాణాలను హరిస్తున్న చెరువులు, సముద్ర స్నానాలు
- సరదా మాటున ప్రమాదాలు



తూరంగి దేవాలయం వద్ద కోనేరులో ఈత కొడుతున్న చిన్నారులు (ఫైల్)

కాకినాడ సిటీ: మండే వేసవి.. ఆపై కాస్త విరామం.. సరదాగా స్నేహితులతో కలసి కాలువలు, చెరువులు, సముద్రం వద్ద స్నానాలు.. ఇలా చల్లని నీటి మాటున ప్రమాదం పొంచి ఉంది. ఎందరో జీవితాలను చిదిమేస్తోంది.. కన్నవారికి కడుపుకోతను మిగుల్చుతోంది. గత రెండేళ్లలో తూరంగి, కరప, వేళంగి, సర్పవరం, కాకినాడ సిటీ నియోజకవర్గాల్లోని కాలువలు, చెరువులు, సముద్రంలో స్నానాలు చేస్తున్న సమయంలో సుమారు నలుగురు చిన్నారులు, ముగ్గురు యువకులు మృత్యువాత పడ్డారు. తల్లిదండ్రులకు గర్భశోకం మిగిల్చారు. నీటిని చూడగానే పిల్లల్లో ఉత్సాహం ఉరకలేస్తోంది. తమకు ఈత రాదనే విషయాన్ని కూడా మరిచిపోతారు. తాము దిగుతున్న నీటి కుంటలు, సముద్రం లోతు తెలియక ఎంతో మంది ప్రాణాలు కోల్పోతున్నారు. రూరల్‌లోని సూర్యారావుపేట, నేమాం, వాకలపూడి, ఫిషింగ్ హార్బర్‌పేట ప్రాంతాల్లో అధికంగా సముద్ర స్నానాలు చేస్తుంటారు. ఇక్కడే జాగ్రత్తలు పాటించాల్సిన అవసరం ఉంది. కరప మండలం వేళంగికి చెందిన ఇద్దరు యువకులు కె.గంగవరం మండలం కూళ్లలో స్నేహితుడి పుట్టినరోజు వేడుకలకు ఇటీవల వెళ్లారు. అక్కడ గోదావరిలో స్నానానికి దిగి ఆ యువకులు మృతి చెందారు. ఈ ఘటన ఆయా కుటుంబాల్లో తీవ్ర విషాదాన్ని నింపింది.

తస్మాత్ జాగ్రత్త

తల్లిదండ్రులూ తస్మాత్ జాగ్రత్త. ఎందుకంటే పాఠశాలలకు ఒంటిపూట బడులను నిర్వహిస్తున్నారు. మధ్యాహ్నం నుంచి బడులకు సెలవు కావడంతో ఇంటికి రాగానే పుస్తకాల బ్యాగ్‌లను పక్కన పెట్టేసి విద్యార్థులు ఆటల బాట పడుతుంటారు. ఈ ఆనందం వెన్నంటే విషాదాలు కూడా పొంచి ఉంటాయి. ఈత, బైక్ రైడింగ్, క్రికెట్ వంటివి మండే ఎండలో చిన్నారులకు ముప్పుతిప్పలు పెట్టేవే. వీటి నుంచి పిల్లలను సంరక్షించుకోవాల్సిన బాధ్యత తల్లిదండ్రులపైనే ఉంది. వీటివల్ల జరిగే ప్రమాదాల గురించి పిల్లలకు అవగాహన కల్పించాల్సిన అవసరం ఉంది.



సూర్యారావుపేట బీచ్‌లో సముద్ర స్నానాలు చేస్తున్న యువకులు

ఎండలతో అనర్థాలు

ఈ నెలలో ఎండలు మండుతున్నాయి. పిల్లలను వీలైనంత వరకూ బయటకు వెళ్లకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. ఎక్కువ సమయం ఎండలో ఉండడం వల్ల శరీరం వేడెక్కి పిల్లలకు వాంతులు, విరేచనాలు అయ్యే ప్రమాదం ఉంది. దీంతో పాటు ఎండకు శరీరంలోని నీరంతా చెమట రూపంలో బయటకు వచ్చి వడదెబ్బకు గురవుతుంటారు. అందుకే అధిక నీరు తాగేలా చూసుకోవాలి. అప్పుడప్పుడు మంచినీటిలో చిటికెడు ఉప్పు, చక్కెర వేసి ఇవ్వడం మంచిది. కొబ్బరి నీరు తాగించడం వల్ల కూడా నీరసం తగ్గి ఉత్తేజంగా ఉంటారు. పట్టణ, రూరల్ ప్రాంతాల్లో చెరువులు, బావులు, సముద్రం ఉంటాయి. వీటిలో సరదాగా ఈత నేర్చుకునేందుకు పిల్లలు వెళుతుంటారు. అలా వెళ్లి ప్రమాదాల బారిన పడే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో చిన్నారులు ఈతకు వెళ్లాల్సి వస్తే తప్పనిసరిగా పెద్దలు వెంట ఉండాలి.

టీవీలతోనూ ముప్పే..

ఒంటిపూట బడుల సమయంలో పాఠశాల అయిపోగానే చిన్నారులను ఇంటికి తీసుకుని వచ్చి కాస్తంత భోజనం చేయించి కొద్దిసేపు నిద్రించేలా చూడాలి. ఆ తరువాత ఇంటి పరిసరాల్లో చెట్ల నీడలో ఆడుకునేలా తల్లిదండ్రులు చొరవ తీసుకోవాలి. అలా కాకుండా ఇంట్లో తరచూ టీవీలు, కంప్యూటర్, సెల్, లాప్‌ట్యాప్ వీడియో గేమ్స్‌లకు అతుక్కుపోవడం వల్ల పిల్లల్లో దృష్టి లోపం తలెత్తే అవకాశం ఉందని నేత్ర వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు.

బాధిత కుటుంబాలకు ఎమ్మెల్యే పరామర్శ



వేళంగిలో బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే కన్నబాబు

కరప: వేళంగిలో ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు కురసాల కన్నబాబు శనివారం పర్యటించారు. ఇటీవల కూళ్ల వద్ద గోదావరిలో స్నానానికెళ్లి మృతిచెందిన వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. వేళంగికి చెందిన పితాని రాజేంద్రప్రసాద్, కొప్పిశెట్టి మురళీసాయి మృతి చెందగా వారి కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే ఓదార్చారు. మండల పార్టీ అధ్యక్షుడు చింతా ఈశ్వరరావు, ఎంపీపీ పెంకే శ్రీలక్ష్మి, సత్తిబాబు, జి.భావారం సర్పంచ్ రొక్కాల గణేష్ తదితరులు పాల్గొన్నారు.

రంగారావు మాస్టారు మృతికి సంతాపం

కరప: గ్రామానికి చెందిన విశ్రాంత ఉపాధ్యాయుడు రావు రంగారావు మాస్టారు (91) శుక్రవారం రాత్రి మృతి చెందారు. కరప హైస్కూల్‌లో ఆయన ఉపాధ్యాయుడిగా పనిచేసి వేలాది మందికి విద్యా బోధన చేశారు. ఆయన మృతికి సర్పంచ్ సాదే ఆశాజ్యోతి, జెడ్పీటీసీ సభ్యుడు పెంకే శ్రీలక్ష్మి, ఎంపీపీ పెంకే శ్రీలక్ష్మి, మాజీ సర్పంచ్ పోలిశెట్టి తాతీలు తదితరులు సంతాపం తెలిపారు.

ఘనంగా రంజాన్ వేడుకలు

- నగర ఈద్గా మైదానంలో సందడి
- పాల్గొన్న ఎమ్మెల్యేలు కన్నబాబు, చంద్రశేఖరరెడ్డి



రంజాన్ ప్రార్థనల్లో ఎమ్మెల్యేలు కురసాల కన్నబాబు, ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి తదితరులు

కాకినాడ: నగరంలో రంజాన్ పండుగను శనివారం ముస్లింలు భక్తిశ్రద్ధలతో జరుపుకొన్నారు. కాకినాడ–పిఠాపురం రోడ్డులోని ఈద్గా మైదానంలో వేలాదిగా తరలివచ్చిన ముస్లింలు ఒకరినొకరు ఆలింగనం చేసుకుని ఈద్ ముబారక్ చెప్పుకున్నారు. భక్తిశ్రద్ధలతో ఈద్-ఉల్-ఫితర్ ప్రార్థనలు చేశారు. జామియా మసీదు ఇమామ్ అబ్దుల్‌రజాక్ రిద్వి ఈద్ ప్రార్థనలు చేయించారు. కాకినాడ సిటీ, రూరల్ ఎమ్మెల్యేలు ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి, కురసాల కన్నబాబు కార్యక్రమానికి హాజరై ముస్లింలకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, రూరల్ ఎమ్మెల్యే కురసాల కన్నబాబు మాట్లాడుతూ రంజాన్ మత సామరస్యానికి ప్రతీకగా నిలుస్తోందన్నారు. ముస్లింల సంక్షేమానికి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. రూరల్ నియోజకవర్గ పరిధిలో షాదీఖానాలు, కమ్యూనిటీ హాల్స్, బరెల్ గ్రౌండ్స్‌ను అభివృద్ధి చేసుకున్నామని కన్నబాబు చెప్పారు. సిటీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి మాట్లాడుతూ మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి ముస్లింలకు కల్పించిన నాలుగు శాతం రిజర్వేషన్లతో ఎంతో మంది డాక్టర్లుగా, ఇంజినీర్లుగా ఉన్నత స్థానంలో ఉన్నారన్నారు. ఇప్పుడు ఆయన తనయుడు సీఎం జగన్ కూడా ముస్లిం మైనార్టీల సంక్షేమానికి కట్టుబడి పనిచేస్తున్నారన్నారు. ముస్లింలు అంతా జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వానికి అండగా నిలవాలని కోరారు. ఈ ఏడాది అన్ని మసీదులలో జరిగిన ఇఫ్తార్ విందులకు హాజరుకావడం, మహిళలతో ప్రత్యేక ఇఫ్తార్ విందు ఏర్పాటు చేయడం సంతృప్తినిచ్చిందన్నారు. ఈద్గా మైదానంలోని నూరాని మసీదు నిర్మాణానికి తన వంతు సహకారం అందిస్తానన్నారు. కార్యక్రమంలో ముస్లిం పెద్దలు ఇక్బాల్ ఆలీ, ఆలీషా, వైఎస్సార్ సీపీ మైనార్టీ సెల్ ప్రాంతీయ సమన్వయకర్త అబ్దుల్ బషీరుద్దీన్, జిల్లా వక్ఫ్ బోర్డు అధ్యక్షుడు రెహ్మాన్ ఖాన్, కార్యదర్శి కరీం బాషా, నాయకుడు సుంకర విద్యాసాగర్ తదితరులు పాల్గొన్నారు.



సులేమాన్ దంపతులను సత్కరిస్తున్న దూసర్లపూడి రమణరాజు



ప్రార్థనలకు హాజరైన ముస్లిం సోదరులు

రంజాన్ ప్రార్థనలు

కాకినాడ: కాకినాడ నయన హాస్పటల్ సమీపంలో రంజాన్ ప్రార్థనలను భక్తిశ్రద్ధలతో జరుపుకొన్నారు. సుమారు 1,500 మంది ముస్లింలు మహిళలతో కలసి హాజరై ప్రార్థనలు చేశారు. దీనికి సిటీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి హాజరై ముస్లింలకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. అల్లా దయతో ముస్లిం మైనార్టీలు మరింత అభివృద్ధి సాధించాలని ఆయన ఆకాంక్షించారు. ముస్లిం మైనార్టీ ప్రతినిధులు ఎండీ అస్గర్, అబ్దుల్ బషీరుద్దీన్, వైఎస్సార్ సీపీ నాయకుడు సుంకర విద్యాసాగర్ తదితరులు హాజరయ్యారు.

బోట్‌క్లబ్: రంజాన్ సందర్భంగా స్థానిక రామకృష్ణారావు పేటలోని సీనియర్ సిటిజన్ సులేమాన్ కుటుంబ సభ్యులు ఇఫ్తార్ విందు ఇచ్చారు. ఇందులో భోగి గణపతి పీఠం వ్యవస్థాపకుడు దూసర్లపూడి రమణరాజు పాల్గొని మాట్లాడుతూ ప్రజలంతా ఐక్యంగా సాగడమే ఆదర్శ భారత్‌కు సంకేతమన్నారు. అనంతరం సులేమాన్, ఫర్హానా బేగం దంపతులను సత్కరించారు. ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు టి.రాజా పాల్గొన్నారు.

పటిష్టంగా ఘన వ్యర్థాల నిర్వహణ

- కమిషనర్ మహేష్‌కుమార్



ఘన వ్యర్థాల నిర్వహణ కేంద్రాన్ని పరిశీలిస్తున్న కమిషనర్ డాక్టర్ మహేష్‌కుమార్

కాకినాడ: ఘన వ్యర్థాల నిర్వహణను మరింత పటిష్టంగా చేపట్టాలని కాకినాడ నగరపాలక సంస్థ కమిషనర్ డాక్టర్ మహేష్‌కుమార్ రావిరాల అధికారులకు సూచించారు. శనివారం స్థానిక ఇంటిగ్రేటెడ్ సాలిడ్‌వేస్ట్ మేనేజ్‌మెంట్ కేంద్రాన్ని ఆయన సందర్శించారు. అక్కడ జరుగుతున్న కార్యకలాపాలను పర్యవేక్షించారు. ఎన్విరాన్ ఎకో మేనేజ్‌మెంట్ సంస్థ ద్వారా పొడి చెత్తను ప్రోసెసింగ్ చేస్తున్నట్లు డీఈ మాధవి కమిషనర్‌కు వివరించారు. అలాగే తడి చెత్త నుంచి ఆర్గానిక్ కంపోస్టు తయారీ చేస్తున్నామన్నారు. వీటి నిర్వహణను మరింత మెరుగుపర్చేలా చర్యలు తీసుకోవాలని కమిషనర్ సూచించారు. రోజుకు ఎంత చెత్త ఉత్పత్తి అవుతుంది.. అందులో తడి చెత్త ఎంత.. పొడి చెత్త ఎంత.. దీనిని ఎలా విభజించి యంత్రాల ద్వారా ఎలా ప్రోసెస్ చేస్తున్నారనే అంశాన్ని ఆయన తనిఖీ చేశారు. అనంతరం పట్టణంలో పారిశుధ్య పనులను కమిషనర్ తనిఖీ చేశారు. ఆదిత్య కళాశాల– డీమార్ట్ ప్రాంతాల మీదుగా క్షేత్రస్థాయిలో పరిశీలించారు. రోడ్ల శుభ్రత ఎలా ఉంది.. డ్రైనేజీలను శుభ్రం చేస్తున్నారా.. పారిశుధ్య కార్మికులు సకాలంలో విధులకు వెళ్తున్నారా.. వంటి అంశాలను స్వయంగా పరిశీలించారు. మరింత మెరుగైన పారిశుధ్యానికి తీసుకోవాల్సిన చర్యలను నగరపాలక సంస్థ ఆరోగ్యాధికారి పృథ్వీచరణ్‌కు సూచించారు. అలాగే వెహికల్ యార్డ్‌ను కమిషనర్ సందర్శించారు. ఆయన వెంట పలువురు శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, సచివాలయ ఉద్యోగులు ఉన్నారు.

జాగ్రత్తలతో ప్రమాదాల నివారణ



ఉప్పలంక సమావేశంలో మాట్లాడుతున్న సీఐ శ్రీనివాస్

కరప: జాగ్రత్తలు పాటించడం ద్వారా రోడ్డు ప్రమాదాలను నివారించవచ్చని కాకినాడ రూరల్ సీఐ కె.శ్రీనివాస్ అన్నారు. ఉప్పలంకలో శనివారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మద్యం తాగి వాహనాలను నడపరాదని, హెల్మెట్ ధరించాలన్నారు. వేసవిలో చోరీలు ఎక్కువగా జరుగుతుంటాయని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఆరుబయట నిద్రించేవారు ఇంట్లో అన్ని గదులకూ తాళాలు వేసుకోవాలన్నారు. ఎవరైనా గ్రామం వదిలి బంధువులు, స్నేహితుల ఇంటికి, శుభకార్యాలు, పుణ్యక్షేత్రాలకు వెళ్లినప్పుడు బంగారు ఆభరణాలు జాగ్రత్త పరచుకోవాలన్నారు. పోలీస్ స్టేషన్‌లో కూడా సమాచారం ఇచ్చి వెళ్లాలన్నారు. అనంతరం శివారు మొండి వద్ద రోడ్డు ప్రమాదాలు, చోరీలు జరగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. వైఎస్సార్ సీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు బొమ్మిడి సతీష్, కరప, కోరంగి ఎస్ఐలు నౌడు రామకృష్ణ, పి.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

నాడు కన్నీళ్లు.. నేడు ప్రగతి పరవళ్లు



ఈ నెల 2న వర్షానికి మండల పరిషత్ కార్యాలయం వద్ద నిలిచిన నీరు



రమణయ్యపేటలో ఎంపీడీఓ కార్యాలయం ఎదురుగా రోడ్డు నిర్మాణం

కాకినాడ రూరల్: వెళ్లే దారి అందంగా మారింది.. అభివృద్ధి పనులతో అది సాధ్యమైంది.. రమణయ్యపేటలో రూరల్ మండల పరిషత్ కార్యాలయం ఎదురుగా ఉన్న రోడ్డు ప్రగతి బాట పట్టింది. సర్పవరం జంక్షన్ నుంచి రమణయ్యపేట మార్కెట్, మండల పరిషత్‌కు వచ్చే రోడ్డు పల్లంగా ఉండడంతో ఈ నెల 2న కొద్దిపాటి వర్షానికే మోకాలు లోతు నీరు నిలిచిపోయింది. దీనిపై స్థానికుల అభ్యర్థన మేరకు ఎమ్మెల్యే కురసాల కన్నబాబు ఆదేశాలతో అధికారులు మండల పరిషత్ నిధులతో రోడ్డు పనులు చేపట్టారు. రమణయ్యపేట మార్కెట్ కూడలి నుంచి వినాయకుడి గుడి వరకూ సిమెంట్ రోడ్డు నిర్మిస్తున్నారు. రోడ్డు ఎత్తుగా మారడంతో వర్షాకాలంలో ఇబ్బందులు తప్పినట్టేనని స్థానికులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

కిటకిటలాడిన శృంగార వల్లభుని ఆలయం



తిరుపతిలో శృంగారవల్లభ స్వామి

పెద్దాపురం: తొలి తిరుపతి స్వయంభూగా పిలువబడే శృంగార వల్లభ స్వామి ఆలయానికి శనివారం భక్తులు పోటెత్తారు. అక్షర తృతీయ, నెల పొడుపు, సెలవు దినం కావడంతో వేకువజాము నుంచే రద్దీ నెలకొంది. కాకినాడ జిల్లా దేవదాయ శాఖ కమిషనర్, ఇన్‌చార్జి ఆలయ కార్యనిర్వహణాధికారి పులి నారాయణమూర్తి, ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు పెద్దింటి పురుషోత్తమాచార్యులు, పెద్దింటి నారాయణాచార్యులు స్వామివారికి తులసి దళాలతో స్వామికి అలంకరణ చేశారు. ఆలయంలో అన్నసమారాధన, విరాళాలు, దర్శనం, కేశఖండన టిక్కెట్ల విక్రయాల ద్వారా శనివారం రూ.4.42 లక్షల ఆదాయం సమకూరిందని ఈఓ నారాయణమూర్తి తెలిపారు. సుమారు 30 వేల మంది భక్తులు స్వామివారిని దర్శించుకున్నట్లు వివరించారు.

ఆలయానికి గోవు బహూకరణ

సామర్లకోట: స్థానిక మాండవ్య నారాయణస్వామి ఆలయంలో నిత్యం ఆవు పాలతో పూజలు జరిగే విధంగా పారిశ్రామిక వేత్త బిక్కిన సత్యసాయి కుటుంబ సభ్యులు గోవును బహూకరించారు. ఈ మేరకు ఆలయంలో గోపూజ చేశారు. పరశురామ జయంతిని పురస్కరించుకుని ఆవును అందించారు. అనంతరం దాత సాయి కుటుంబ సభ్యులు పూజలు చేశారు.

14న శోభాయాత్ర

హనుమాన్ జన్మ దినోత్సవాన్ని పురస్కరించుకుని వచ్చే నెల 14న హనుమాన్ శోభాయాత్ర జరుగుతుందని నిర్వాహకులు కర్రి ఆదినారాయణ రెడ్డి, పి.ప్రభాకర్, ఎం.వీరబాబు, జీవీకే మోహన్‌రావు తెలిపారు. సామర్లకోట ప్రసన్నాంజనేయ స్వామి ఆలయం నుంచి మోటార్ సైకిళ్లతో యాత్ర నిర్వహిస్తామన్నారు.

ప్లాస్టిక్ రహిత సమాజాన్ని నిర్మిద్దాం



కుళాయి చెరువు ఆవరణలో వస్త్ర సంచులు పంపిణీ చేస్తున్న ధరిత్రి సభ్యులు



రమణయ్యపేటలో అడబాల ట్రస్ట్ ద్వారా వస్త్ర సంచుల పంపిణీ

బాలాజీచెరువు: ప్లాస్టిక్ రహిత సమాజ నిర్మాణంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని జేఎన్‌టీయూకే డైరెక్టర్ ఆఫ్ ప్లానింగ్ ప్రొఫెసర్ కేవీఎస్‌జీ మురళీకృష్ణ అన్నారు. స్థానిక కుళాయి చెరువు ఆవరణలో ధరిత్రి దినోత్సవం సందర్భంగా ధరిత్రి రక్షిత సమితి ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సకల జీవాలకు ఆధారమైన భూమిని కాపాడుకోవడం అందరి బాధ్యత అన్నారు. దీనికి గాను ప్లాస్టిక్ వాడకాన్ని పూర్తిగా తగ్గించి భూ కాలుష్యాన్ని అరికట్టాలన్నారు. పరిశ్రమల వ్యర్థాల కంటే మనం వాడే ప్లాస్టిక్ అనర్థదాయకమని అన్నారు. మొక్కలను సంరక్షించపోవడంతో వాయు కాలుష్యం ఏర్పడుతుందన్నారు. ధరిత్రి రక్షిత సమితి ఆధ్వర్యంలో పర్యావరణ పరిరక్షణకు చేస్తున్న సేవలను కొనియాడారు. అనంతరం సమితి అధ్యక్షురాలు సురేఖ ఆధ్వర్యంలో ఉచితంగా వస్త్ర సంచులు పంపిణీ చేశారు. నేషనల్ హైడ్రాలజీ సైంటిస్ట్ వై.సత్యాజీరావు, కార్యదర్శి నరసింగరావు, ఉపాధ్యక్షుడు ఈశ్వరరావు, కోశాధికారి సి.మురళీకృష్ణ, జేఎన్‌టీయూకే అధ్యాపకులు ఆలపాటి శ్రీనివాసరావు, మృత్యుంజయరావు పాల్గొన్నారు.

వృక్షాలే ఆత్మ బంధువులు

కాకినాడ రూరల్: వృక్ష సంపద పర్యావరణాన్ని పరిరక్షిస్తూ మానవాళికి ఆత్మ బంధువులా నిలుస్తుందని గ్రంథాలయ విశ్రాంత ఉద్యోగి చింతపల్లి సుబ్బారావు అన్నారు. రమణయ్యపేట ఏపీఐఐసీ కాలనీలో అడబాల ట్రస్ట్ ఆధ్వర్యంలో ప్రపంచ ధరిత్రి రక్షిత దినోత్సవాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దట్టమైన అడవులను నరికేయడం, సహజ నిక్షేపాలను భారీగా వెలికితీయడంతో పర్యావరణ సమతుల్యత దెబ్బతింటుందన్నారు. భూ వనరులను పొదుపుగా వినియోగించుకుంటేనే భవిష్యత్తు తరాలకు మేలు జరుగుతుందన్నారు. అనంతరం వస్త్ర సంచులను పంపిణీ చేశారు. అడబాల ట్రస్ట్ చైర్మన్ అడబాల రత్నప్రసాద్, రేలంగి బాపిరాజు, డాక్టర్ శిరీష, రవిశంకర్ పట్నాయక్ పాల్గొన్నారు.

వివాహితపై హత్యాయత్నం

కాకినాడ క్రైం: తనపై భర్త, అతని కుటుంబ సభ్యులు పెట్రోలు పోసి హత్యాయత్నానికి ఒడిగట్టారని ఓ వివాహిత పేర్కొంది. శనివారం రాత్రి చోటు చేసుకున్న ఈ ఘటనకు సంబంధించి పోలీసుల కథనం ప్రకారం.. కాకినాడ దుమ్ములపేటకు చెందిన ఓసుపల్లి పుష్పకు శివాజీతో కొన్నేళ్ల కిందట వివాహమైంది. తల్లి చెప్పిన మాటలతో శివాజీ కొద్ది నెలలుగా కట్నం తేవాలంటూ వేధిస్తున్నాడని పుష్ప చెబుతోంది. ఈ నేపథ్యంలో 19న తనపై దాడి చేయడంతో కాకినాడ జీజీహెచ్‌లో చేరినట్లు ఆమె తెలిపింది. దీనిపై ఎంఎల్‌సీ కేసు నమోదైంది. వరకట్న వేధింపులకు కొనసాగింపుగా శివాజీ అతని తల్లి, సోదరుడితో కలసి శనివారం రాత్రి పుష్పపై పెట్రోలు పోసి నిప్పంటించబోయారు. స్థానికులు అడ్డుకుని ఆమెను జీజీహెచ్‌కు తరలించారు. బాధితురాలికి ఏఐటీయూసీ అండగా నిలిచింది. 19న దాడి జరిగి ఎంఎల్‌సీ నమోదైతే పోర్టు పోలీసులు కేసు కట్టలేదని సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి తోకల ప్రసాద్ అన్నారు. అప్పుడే కేసు పెట్టి ఉంటే ఈ పరిస్థితి ఎదురయ్యేది కాదన్నారు. శనివారం ఘటనపై కాకినాడ పోర్టు పోలీసులు కేసు నమోదు చేశారు.